లకుముకి సంభ్రమాశ్చర్య ప్రమోదచకితయై తడబాటుగా అడిగింది.

“ఎందుకింత సాహసం? నాకోసమే? నాకోసమే?” అంటూ లకుముకి సంగమయ్య కౌగిట్లోకి వొరిగి, కన్నీరు గారుస్తూ “నీకోసమే! నీకోసమే!” అని అనేదాకా తన కౌగిట నదిమి విడిచిపెట్టిందికాదు.

మర్నాటినుంచి ఏటివొంక గుజగుజలు “ఇద్దరికీ వొకే మందిచ్చింది కొండచిన్నడి. అది వెంకన్న విషయంలో విషమించింది, సంగమయ్య విషయంలో పట్టిచ్చింది!” ట!

... ... ... ... ...

## “చింతకు చిగురు - పిల్లకు పొగరు”

“చింతపిక్కలాడినాను; చింతచిగురు కోసినాను?
అంతులేని యీ జగత్తంత తెలుసుకున్నాను”

అయితే నేనాడిన పిక్కలే మొక్కలై యిక్క డిలా చిగిర్చాయా? చెప్పగల్దురేమో ఆ బామర్ల చిన్నోడు–“ఏమండో మిమ్మల్నే! ఇలా చూడరేం? నేనాడిన పిక్క లేలా మొక్కలై చిగిరించాయో!” అని తానుకోసిన చింతచిగురు తట్టవంచి చూపెట్టింది హరిజన తరుణి యొక్కర్తు, హైరోడ్డు వోరో రెండెంపులా వరుసగా పెరిగిన పెద్దపెద్ద చింతచెట్ల క్రింద నిలుచుండి. ఆ చింతచెట్లు ఆమెకు “గార్డు ఆఫ్ ఆనర్” కూర్చినట్టు అర్చి తేలి కొమ్మల చంకలకంటా చిగురు మయమై ఆమందానందాన్ని చేకూరుస్తూ వున్నాయి.

లేకలేక ఆక్రితం రాత్రి కురిసిన వేసంగివానకు తెల్లాటి ఆచెట్లు ఆ చిగురుతో ఎలాకనబడుతున్నాయి? ఇంకా నింగిని డాడుతూవున్న నల్లమబ్బుక్రింద ఎలా కనబడాలో అలా కనబడు

ఇల్లలికి ముగ్గెట్టినంత ముచ్చటగా ముద్దుగా కనబడుతున్నాయి! కాలంతోపాటు దేశంకూడా నిర్దేశిస్తే. ఏనాడైనా కనుగొంటాడో పాఠకుడు కాకపోతే పోపాఠకుడైనా రాజమహేంద్రానికి ధవిళేశ్వరానికి సర్గిగ్గా మధ్యన ఇటో పది అటో పది వున్నాయిలెండి చిరంతనపు చింతలు కరువుతీర ఏయేటి కాయేడు చిగురుపట్టి.

"చింతకు చిగురు - అంచుకు తొగరు
గొల్లకు తగరు - పిల్లకు పొగరు"

ఉండాలీ అని అనజేస్తాయి తప్పకుండా అవి!

"అంచుకు తొగరు" అంటే జ్ఞాపకం వచ్చినది. అక్కణ్ణే వుంది, ఆ చింతచెట్ల వరుసలో ధవళేశ్వరం వెంపు ఆఖరు చింత చెట్టు కావల ఈవైపునుంచి వెడుతూవుంటే హైరోడ్డు కుక్కడితట్టు సరిగ్గా ఆనిందో లేదో పాఠకులచూపు-ఒక తురాయి చెట్టు!

"చెట్టంత పువ్వు!
పువ్వంత ఎరుపు!"

అన్నట్టు చెడామడా విరగబూసి వెఱ్ఱెత్తినదానిలా కనిపిస్తూ బఱ్ఱెలను బెదరించే తీరున వొంగి వూగుతూవుంది. పిల్లగాలి రవ్వ పులుసు అందుకుంటూన్న మాదిరిగా చింతను తాకుతూ తప్పించుకుంటూ!

తరుణి పలకరించిన బ్రాహ్మణ కుమారుడు అపరవిప్ర ప్రవరాఖ్యునిలా అందుకుంటూ వున్నాడు తురాయి పువ్వు. పువ్వుపువ్వు చెట్టునుండగానే రొబ్బపాళంగా త్రుంచుదామనో ఏమో వాని యూహ. విరిగి అతగాడి చేతిలోకొచ్చింది ఒక్కరేకా కూడా నేలపడకుండా అంతరొబ్బా అంతపువ్వు తోటీని!

హరిజన తరుణి కన్నెఱ్ఱగా అపూరెమ్మకేసి చూస్తూ— "నా కందలేదండీ యీదాకా ఎంత తంటాలుపడ్డా! ఆ తురాయి పువ్వు మీరిట్టే అందుకున్నారు! మీ బామర్లనోట మంత్రం నిజంగా వుంది కామోసు" అని కూకేసినంత గట్టిగా నిర్వచించింది.

బ్రాహ్మణ వర్చస్వి మాజాడ కూరుకోవచ్చునా? ఊరుకో లేదు. ఊరుకోక ఏమన్నాడు ?–"నీకు చిగురెల్లా అందిందో నాకిదీ అల్లాగే అందింది. మరి కొంచెం ఎగిరితే ఈ కాలంలో అందరిదీ ఒకటే మంత్రం కైంకర్య మంత్రం!" అన్నాడు.

హరిజన తరుణి అంది–"అంటే అప్పుడే నేకోసిన చింత చిగురుమీద తమరి కన్ను పడిందన్నమాటే!" అని కళ్లెగరేసింది.

యువకుడు "ఏం అమ్ముతావా?" అన్నాడు.

యువతి "నడిబజార్లో అమ్ముతాంగాని చెట్టుక్రింద, అందులోను ఏ చెట్టునుండి కోసామో ఆ చెట్టుక్రింద అమ్మం దొరగారూ" అని అంది. "తమకు కావలిస్తే ఉత్తినే తీసుకోండి!" అంది నిజవృత్తి మెలిసాలా!

యువకుడున్నూ తనచేత పూరెమ్మ అలా వుంచుకునే ఆ జవ్వనికడకు చన్నవాడై "ఎంతుందేంటి?" అంటూ తట్టలోకి తొంగిచూచాడు. ఆమె తట్ట వంచుతూ రెండు గుప్పిళ్లకుంటుంది, వొద్దేలేదు అని అనుకోకండి. మేలింలాంటి చిగురు! ఎలా పట్టు కెడతారు?" అంటూ తన కుడిచేతను బులబులాగ్గా ఆ కూర నొల్లుతూ పైకెత్తి చూపించింది. చూపిస్తూ ఆ వ్విప్రవటుణ్ణి—వానిని వటునిగా భావించమని మనవి-నఖశిఖ పర్యంతం పరీక్షగా పరకాయిస్తూంది.

తెల్లటి ఖద్దరు లాల్చీ, పక్కజేబు గలదాన్ని తొడిగా డతగాడు. నెత్తిమీద అంతకంటె తెల్లటి గాంధీటోపి పెట్టాడు. ఎడం బుజంమీద చాకలి పెట్టిన మడతకండువా వేసికొన్నాడు పంచికూడా అందుకు సరిసమానంగా కుచ్చెళ్లుపోసి మిక్కలి పరిశుభ్రంగా నీళ్ళు కలపని పాలలా వున్నాడు.

ఆ వేషం అనీటూ చూస్తూ హరిజనాంగన పరిపరివిధాల యోచింప దొడంగింది-అడిగింది కూడాను-"పంచి పట్టరాదండీ! కండువా పరవకూడదండీ! టోపీలో వేసుకుంటే తప్పా? జేబులో

వేసెయ్యమంటారా? తమరి చేతుల్లో పువ్వులున్నాయికందా, మరెల్లా పట్టుకెడతారు?" అని ప్రశ్నమీద ప్రశ్నగా.

దేనికీ జవాబు చెప్పకుండా బ్రాహ్మణ చిన్నవాడు ఆ ఆడది ఖాళీచేసిన తట్టలోకి తన చేతనున్న పూరెమ్మనంతనూ అలావిసరి తన దోసిలిపట్టి దోసిట్లోకి ఎత్తిపడెయ్యి అన్నట్టు 'పడెయ్యి' అని అభినయించాడు.

హరిజన స్త్రీ "తమకింకా 'అస్ప్రస్యత' రోగం పోలేదండీ! అలాగే కానీయండి" అని ఎత్తిపడేస్తూ – అతగాడు దోసిట్లోని చిగురు జేబులోకి కళ్ళు వంచుకుంటూ కుక్కుకుంటూ వుంటే తాను అనగా ఆ తరుణి ఆ తురాయి పూరొబ్బ పూరొబ్బా కొప్పులో కుక్కుకుంటూ వట్టితట్ట చంకనెట్టుకు చక్కాపోసాగింది. ఇత గాడు తలెత్తి కనుగొని తిరిగి పూరెమ్మ తట్టలోంచి తాను తీసి కొందాం అని అనుకునే సరికి ఎవరికీ అందనంత దూరంలో కొప్పు కాపరుస్తూ, కొప్పులో పువ్వు నవ్విస్తూ ఎదర రంకెవేసే కోడెదూడ నవ్వుడే తన చిరునవ్వుతో కవ్విస్తూవుంది!

"అడమనిషిముందు పంచి పైకి ఎగట్టడం మంచిపని కాదు అని నే నాలోచించి దోసిలిపడితే ఎంత తొందఱగా నా చేతిలో చిగురడేసి చెదిరిపోయింది చెప్పరాని చిన్నది!" అని విస్తు పోసాగాడు. విప్రుడుగాక విటుడగుగాక! ఆ మగవాడు!-టోపీపట్టే గొడవ అతగాని తలపున కసలు రానేలేదో ఏమో? ఏమైతేం మోసపోయినా ననుకున్నాడు అయ్యవకశిఖామణి. "బలే కిల్లాడీగా వల్లోవేసుకు తనక్కావలసిన పువ్వులు తల్లోపెట్టుకు మరీ చక్కాపోతూవుందే జవ్వని" అని డిల్లపోయి చూస్తూ "కండువాలో వేసికొందామంటే ఇది రెండు జేనెలకంటె వెడల్పు లేనిది" అని భుజంమీదనుండి జారిపోతూవున్నదాన్ని సరిచేసుకుంటూ ఆమె వెనకాలే వెల్లడి పల్లంలోకి నాలుగ్గజాలు నాలుగడుగులుగా నడిచాడు.

అంతలో పైని ఆదాకా బిగపట్టు క్కూర్చున్న మేఘం పగిలినట్టుగా మెఱసి ఉరిమి బడబడా కురియసాగింది. హరిజన స్త్రీ తడిసిపోయింది. ఆ ధరామరుడున్నూ తడిసిపోయాడు. చెంతనున్న ఒక పాకలోకి ఇతగాడు చేరుకున్నాడు. వాడి వెంబడినే ఆమెకూడా ఆపాకలోనే వణుకుతూ ప్రవేశించింది.

"ఇది మీ యిల్లా?" అన్నాడు, ఆమె తల్లోపూలు వానకు తడిసి సొంపు రెట్టింపుగా కాపరుస్తూ వుంటే కనుగొంటూ ఆ పురుషుడు. ఆమె "కాదుండి! ఇది గొడ్లపాకండి. ఇందులోనే ఒకమూల మాం వండుకోవడం, వుండడం అన్నీని! మీరు తేమెక్కిపోయినట్టున్నారు" అని అదో విశ్వజనీన ప్రేమావసర ప్రశ్నగా అడిగింది తను తడవనట్టు. "నేనే అన్నమాటేం నీవు మాత్రం తడిసిపోలే?" అని అడిగాడు బ్రాహ్మణుడు. "తడిసిన కొద్దీ మేం శుభ్రపడతాం! చెమటా గ్రటా కడిగివేయబడి! పడ పలాజిగి తేరతాం. తమరు నెయ్యి వొణ్ణం వొంట బట్టిన మా రాజులు భరించలేరు ఇంతటి హొరుగాలి, జోరువాన; మమ్మల్ని తాకనూలేరు, తలపనూలేరు" అంది.

ఆమె యూసు వింటూ అతగాడు ఒక లిప్త తలపోశాడు, ఆమె నుదుటిని గన్న యుదయపు చెమ్మట ఆమె నోటనువిన్న 'అస్పృశ్యత' పదనూతనోచ్చారణ 'అసుప్రస్యత'

వెంటనే అతని హృదయంలో వినూతన వికాస మేం కలిగిందో–"అదివరకు మనం ఏలావున్నా ఈవాన మనకు ఇద్దరకూ పరిశుభ్రస్నానాన్ని ఒడగూర్చింది. అజ్ఞానాన్ని తొలగించింది. నీవు నిజంగా ఈ భారతదేశానికి చక్రవర్తినివి కాదగ్గ కాంతవు. ఇదే నీకు నా జోహారులు!" అని తన టోపీతీసి ఆమె ముందు మోకరిల్లాడు.

ఆమె అతగాడి బట్టతల పరికిస్తూ- పెద్ద నవ్వు నవ్వి 'ఇందు చేతనా టోపీ పెట్టారు కాదు చిగురుకోసం ఇందాకా? దానికేంలెండి

కాని" అని తన సవరపుకొప్పు కనబడకుండా కొప్పులోని పూల్తో కప్పెట్టుకొంటూ "వెనకటికి గాంధీగారూ చచ్చి స్వర్గాన్ని వున్నారు! ఇల్లాగే అన్నారు! మాకు మీ రాచకీయ రంధులేమీ తెలియవు.

"పూచిన చెట్టూ పొద వెంతో
కాచిన చెట్టూ వల మెంతో
కొలిచే దానిని నేనండోయి!"

అని పాడుతూ.........

"కూడూ గుడ్డా కలిగుంటే - కులముగద్దె లేకుంటే?"

అని ఆడిపోయింది!

భూసురవరుడు "ఓ. కె. ఐడియా!" అని ఆమె నభినందించాడు. వాన వెలిసింది, కథ కంచె మేస్తూంది, కథలోని పాత్ర లిరువురూ పాఠకుల దారి కాస్తూ వున్నారు!

... ... ... ... ...

# నగ్న సుందరి

శరచ్చంద్రు డొకనా డుదయము రెండు ఘడియల ప్రొద్దెక్క తన విశ్రాంతి గదిలో నొక్కరుం డుపవిష్టుండై గత రాత్రి వచ్చిన కొండొక చిత్తరువుల సంపుటమ్మునం దూఅక పుటలం ద్రిప్పుచు నందందునం బొడసూపు ముఖ్యంబులగు వాని కాభిముఖ్యము భజింపుచుండ, నతని దృక్కులొక్కెడ నిలిచిపోయినవి. దిస మొల దానమాడు నొకానొక ముద్దియ నిట్టనిలువురూపు అతని చూపుల నరికట్టెను. తోడ నొక్క వేడుక చెలికాడున్న లోలోపల నత్తరి వెల్లివిరియు భావముల కొక బాహిర ప్రపంచ మమర్పబడి యుండెడి నోటు! లేడు. చెలికాడు లేడు. లేకుంటయ మేలు. శరచ్చంద్రుడు సిగ్గువిడిచి యా బొమ్మయొక్క నఖశిఖ పర్యంత నగ్నముగ సౌందర్యంబుతో నిటనుకొనుచునాడు-'నీ పేరేమి?'